# ఆపైన ఆ రామభక్తుడి దయ—

* దీక్షితులు *

వీధివాళ్ళందరూ "పట్టి మొద్దు, తెలివితక్కువ వాడు" అనేశారు, నిజానికి నాదగ్గర అట్లాంటి గుణాలు ఏమీ లేకపోయినా. నన్ను తెలివితక్కువవాడు అని ఎవరైనా అనేసరికి పుట్టెడు దుఃఖం వచ్చేది. పరీక్షలు పోయినవాళ్లు వేలకొద్ది. ఈ రత్నగర్భ అయిన భారతదేశంలో వుండగా "మొద్దు అంటే వీడు ఒక్కడే" అని లెఖ్ఖగా చూపడం, ఖాళీప్రదేశం తక్కువగావున్న హృదయాల తొందరపాటుగుణాన్ని వ్యక్తంచేస్తుంది. మెతక అయిన హృదయంగల కొందరు యిట్లా అన్నారని నేను యెంతమాత్రం ఖిన్నుణ్ణవదల్చుకోలేదు.

నామీద ప్యాన్ చేసే, పైని వుదహరించిన తెలివితక్కువ రిమార్కులు అన్నీ రెండవ సంవత్సరం కూడా నా స్కూల్ ఫైనల్ పరీక్ష పోవడంవల్లనే దాపరించాయి. అబద్ధం ఆడి ఫలితంలేదనిన్నీ, యెక్కడికైనా వుడాయించేస్తే మానాన్న నూతిలో చేదని గెలికిలాగినట్టు తిరిగి లాగిపారెయ్యడం ఎట్లాగూ తథ్యమని నేను నాలుగుప్రక్కలా ఆలోచించుకొని, క్రిందటి సంవత్సరం మాదిరీగానే యీ సంవత్సరంకూడా పరీక్ష పోయిందన్న యదార్థం యింట్లో చెప్పేశి, అక్షింతలకి తల ఒగ్గేశేను.

ఫలితాలు వచ్చిన కొత్త పది దినాలూ యిలా కొంచెం బెదురుగా వుంటుందని నాకు క్రిందటి సంవత్సరం గడించుకొన్న అనుభవంవల్ల తెలుసు. కాని మొదటి సంవత్సరం యీ విచారానికి తట్టుకోవడం నేర్చేసుకోవడంవల్ల యిప్పుడంత కష్టంగాను విచారంగాను లేదు.

అయితే విచారాన్ని యీ సమయంలో వ్యక్తపరచి, ఆ మహోదధిలో కొట్టుకుపోతున్నట్టు ముఖభావప్రదర్శన చెయ్యకపోతే తల్లిదండ్రులు యింకో అపోహపడిపోతారు, "రెండుపూట్లా యేమాత్రం తగ్గించకుండా శేరు బియ్యం పోగూ చెల్లగొట్టేడంతో సరిపుచ్చకుండా వీడు బోలెడు డబ్బు ఖర్చుచేయించేడు, పరీక్ష పోతే యీ జడుడికి చీమకుట్టినట్టైనా లేదేం" అని ఆవిధంగా యెక్కడ అనుకొనిపోతారో అని నేను బ్రహ్మాస్త్రంతో తుల్యమయిన ఒక తిరుగులేని పంథా త్రొక్కేశాను. యే పదార్థాన్నైనా యిష్టంలేనట్టు తినడం ; తిండి, త్రాగుడు సమయాల్ని, కాలకృత్యసమయాల్ని మినహాయించి తక్కిన సమయాల్లో తలమీద చెయ్యివేసుకొని యేదో ఆలోచిస్తున్నట్టు, విచారంగా వున్నట్టు ప్లేటువేసెయ్యడం ; ఎవ్వరైనా పలకరిస్తే చాలా విచారంగా నెమ్మదిగా సమాధానం చెప్పడం—ఒక్కవారం రోజులు యీ విధంగా సంచరించాను.

మా నాన్న అమ్మా, 'పాపం, వెర్రినాయన పొయ్యిలో వంకాయిలా బాధపడిపోతున్నాడు' అని తిట్టడం మానేశేరు.

ఎవరైనా మరణిస్తే వుంటుంది చూశారూ దుఃఖం, సరిగ్గా అట్లాంటిదే యీ 'పరీక్ష ఫెయిల్' విచారం. యిది యెన్నోదినాలు వుండదు. ఈ సూత్రం ప్రతి ఫెయిల్ అయిన పౌరుడికీ తెలుసు. మొదటి సంవత్సరం ఫెయిలైనప్పుడు ఈ సూత్రానికి ప్రకృతిసహజంగా బద్ధుణ్ణయాను. పోనీ, పునాది దిట్టం అనికూడా అనుకొన్నాను.

నేను, దేవుడు లేడు, వుంటే కనపడడా అని చాలా రోజులదాకా మూఢాభిప్రాయంలో వుండేవాణ్ణి. మొదటి సంవత్సరం ఫెయిల్ అవడంతోనే నాకు అనుమానం తట్టేశింది, "దేవుడు ఆయన్ని నేను నమ్మనందుకు యీ విధంగా అయినా నా శరీరాన్ని నాకు జ్ఞాపకంచేసి తన వునికిని

నాకు నచ్చచెబుదామని నాకు యీ తాత్కాలిక దుఃఖాన్ని కలుగజేశాడని."

ఈ అనుమానంవల్లనే నా రెండవ సంవత్సరం ఆఖరు టెరమ్‌లో "విద్యార్థులకి కష్టసమయంలో తనప్రాణాల్నయినా యిస్తాడని చెప్పుకోబడే" శ్రీ ఆంజనేయస్వామిసేవ ప్రారంభంచేశాను. రోజూ ఒక కొబ్బెరకాయిముక్క దొరుకుతూవుండేది, ముదిరిన ముక్క వచ్చిననాడు సంతోషిస్తూ, లేత ముక్క వచ్చిననాడు విచారిస్తూ పరీక్షలదాకా గడిపేశాను భగవద్భక్తితో.

అప్పుడప్పుడు అనుమానం తగలకుండావుండేది కాదు, అర్చకుడు ఈ కొబ్బెరముక్కలు వుడాయించేస్తున్నాడేమో అని; 'నా వెఱ్ఱిగాని దేవుడు యీ ముక్కల్ని మోసుకుపోతాడా యేమిటి' అనికూడా అనుకొనేవాణ్ణి తెలివిగా. కాని యిటాంటి అనుకోరాని అనుమానాలు నాలో వున్నట్టు ఆ భక్తజనమందారుడైన ఆంజనేయస్వామికి తెలుస్తే, పరీక్ష ఫేల్ చేసేసి నామీద కక్ష తీర్చుకొంటాడని, ఆ అనుమానం వచ్చినప్పుడల్లా తమాయించుకొనేవాణ్ణి.

ఈ విధంగా ఆంజనేయస్వామిని నేను దూషించకుండా వుండడమే కాకుండా, యెందుకైనా మంచిదని అప్పుడప్పుడు "ఆ మహానుభావుడు గనుక రోజుకొక కొబ్బెరకాయముక్క పెట్టిస్తున్నాడు" అనుకొనేవాణ్ణి.

నేను యింత చాకిరిచేసినా యెందుకు ఫేల్ చేశాడో తెలియదు. బహుశా ఆరాధనలో యేవో లోపాలు వుండివుంటాయి. ఆఖరిటరమ్‌లో యింత హఠాత్తుగా వీడికి భక్తి రావడమేమిటి, వీడి భక్తిచూస్తే "అందేదాకా కాళ్ళు, అందిన తర్వాత జుట్టూలా వుంది" అనయినా అనుకొని వుండాలి, లేదా, అడపాతడపా తెలియనితనంలో అర్చకునితో అతను బ్రద్దలుగొట్టిన కొబ్బరికాయి ముక్కల్లో పెద్దముక్కకోసం దెబ్బలాడినందుకైనా ఆగ్రహించివుండాలి.

ఈ సంవత్సరం మా నాన్న నన్ను తిరిగి స్కూల్లో ప్రవేశపెట్టేపక్షంలో, సంవత్సర ప్రారంభంనుండీ నన్ను నమ్మించిన ఆంజనేయస్వామి ఆరాధన మొదలుచేసి, సంవత్సరాంతందాకా కొనసాగించదల్చుకొన్నాను. మరి, అర్చకుడితో దెబ్బలాటలు, చిల్లరసందేహాలు పెట్టుకోదల్చలేదు. ఆపైన ఆ రామభక్తుడి దయ—

## బలే మందు

